విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడమే లక్ష్యం



దుండిగల్: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడమే తమ లక్ష్యమని బౌరంపేటలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ అన్నారు. జూలై నెలలో న్యూయార్క్‌లో జరిగిన ఎస్ఏఈ-యూనిసెఫ్ సమ్మిట్‌లో ఇషాంక, శశాంక్ అనే విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో గురువారం సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌పై సమ్మిట్ నిర్వహించారు.

- ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. న్యూయార్క్ సదస్సులో పాల్గొనడం ద్వారా తమలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగిందన్నారు. అభ్యాసన అనుభవాలను వ్యాప్తి చేస్తున్నామన్నారు.
- అనంతరం బల్జీత్ ఒబెరాయ్ మాట్లాడుతూ.. 2015లో ఐక్యరాజ్య సమితి ఆమోదించిన ఎస్‌డీజీ అందరికి స్థిరమైన, సమానమైన భవిష్యత్తును సృష్టించే విధంగా 17 లక్ష్యాలతో ఏర్పడిందన్నారు. విద్యార్థులకు వాటి గురించి అవగాహన కల్పించేందుకు, నైపుణ్యం,జ్ఞానం పెంపొందించేందుకు ఇది చక్కటి వేదిక అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీఏఎస్ కో ఆర్డినేటర్ ఫియోనా, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాశాల లైబ్రేరియన్ కరుణ తెలిపారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులకు ఉపయోగపడే అనేక రకాల పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ పుస్తకాలు, వివిధ జర్నల్స్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డా. భవాని మాట్లాడుతూ... కళాశాలలో ఇటువంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. ఇటువంటి వాటిని విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని అన్నారు. లైబ్రేరియన్ కరుణ మాట్లాడుతూ.. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య సేవలను స్మరిస్తూ ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుంచి వారం పాటు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు తిరుపతిరావు

మోతీనగర్: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాల్య దశలోనే ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. ఈగల ప్రసాద్ తేజ దంపతుల కుమారుడు ఈగల తిరుపతిరావు ఇటీవల బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందారు. ఈ నెల 20, 21వ తేదీల్లో ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కిరిజిస్తాన్ బయల్దేరనున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగంతో పాటు దాతలు మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా, జి. లక్ష్మణ్ గుప్త, రాంబాబు, డేనియల్ మిత్రబృందం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ... నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రపంచ స్థాయిలో జరిగే వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు వెళ్లడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కూడా ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకుంటాడనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి.శంకర్ గంగపుత్ర, వి.శ్రీనివాస్‌యాదవ్, యాదిశ్రీ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



మోతీనగర్: సదర్ సమ్మేళన ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయాలను నేటి తరాలకు అందించిన వారమవుతామని బండారి ఐశ్వర్య చంద్రయాదవ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి అల్లాపూర్ డివిజన్ అవంతినగర్ కాలనీలో తన్మయ్ యాదవ్, తరుణ్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారి సుశీల్‌కుమార్ యాదవ్, బండ రాజుయాదవ్, నాయకులు అక్షిత్, వరుణ్, ధనుష్ రెడ్డి, వరుణ్ కుమార్, సందీప్ యాదవ్, జయ, ఉత్తేజ్, సన్నీ, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం

మోతీనగర్: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండటమే విలేకరుల పాత్ర అని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. గురువారం జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లో స్థానిక సీనియర్ విలేకరులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మార్నేని ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా పాత్రికేయుడిగా విధులు నిర్వహిస్తూ అందరిలో ఒకరిగా ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్నామని తెలిపారు. మమ్మల్ని అందరూ గౌరవించడటం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ రాజు, బ్రహ్మ ప్రసాద్, విలేకరులు మార్నేని ప్రవీణ్ కుమార్, తమ్మలి రమేష్, నెల్లుట్ల కిరణ్‌కుమార్, ఆర్ వేణుగోపాలకృష్ణ, ఎల్ల రాముయాదవ్, కొండయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం



కూకట్‌పల్లి: వివేకానందనగర్ శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మండల దీక్షను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పుష్పాభిషేకం, గజారోహణ చేశారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్పస్వామి భజనలు, కీర్తనలు ఆలపించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

ప్రభుత్వ పథకాలే శ్రీరామరక్ష



కీసరలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: సమాజంలోని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష అని మంత్రి మల్లారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో తాను ప్రభుత్వం తరఫున అభివృద్ధి పథకాలు అందించామని అన్నారు. కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని, మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు.

సొంత నిధులతో..

తాను ఎమ్మెల్యే కాగానే కరోనా వచ్చిందని, దాంతో నియోజకవర్గంలో పాలన కుంటుపడిందని, అభివృద్ధి ఆశించినంత చేయలేకపోయానని, ఆ లోటును తీర్చడానికి సొంత నిధులు వెచ్చించి ప్రతి గ్రామం, ప్రతి డివిజన్, వార్డులో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించానని, కులసంఘాల భవనాలు, గుడులు నిర్మించానని అన్నారు. ప్రజలకు కావాల్సిన అవసరాలన్నీ తీర్చానని తెలిపారు. తమ పథకాలే తమకు శ్రీరామ రక్ష అన్నారు.

కీసరలో జోరుగా ప్రచారం..

కీసర మండల కేంద్రంలో మంత్రి మల్లారెడ్డి జోరుగా ప్రచారం చేశారు. ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. భారీ రోడ్ షోలతో ప్రచారం నిర్వహించారు.

జోరుగా ఇంటింటి ప్రచారం..

మేడ్చల్, శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్, మూడుచింతలపల్లి మండలాల్లో, జవహర్‌నగర్, మేడ్చల్, తూంకుంట, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్, పోచారం, బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులు, గ్రామాల్లో స్థానిక నాయకులు ఇంటింటికీ ఉదయం సాయంత్రం వెళ్లి కరపత్రాలను ఓటర్లకు ఇస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వార్డుల్లో జోరుగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

కురుమ సంఘం మద్దతు..

మండలంలోని గొడవెల్లి గ్రామ కురుమ సంఘం నాయకులు మంత్రి మల్లారెడ్డి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. కులసంఘం నాయకులు మంత్రిని కలిసి తమ కులం పూర్తి మద్దతిస్తుందని అన్నారు. మంత్రి, సీఎం కేసీఆర్ తమ కులవృత్తులను పూర్తిగా ఆదుకుంటున్నారని కృతజ్ఞతగా ఎన్నికల్లో మద్దతు ఇస్తున్నామని తెలిపారు.



మల్లారెడ్డికి మద్దతు తెలుపుతున్న కురుమ సంఘం నాయకులు



కీసరలో ఇంటింటికీ బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో మంత్రి మల్లారెడ్డి

పేదోడికి.. పెద్దోడికి పోరు



- మల్లారెడ్డి మజా లేదంటివి కదా.. ఇక కాస్కో..
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్
- పేదోడికి.. ఉన్నోడికి మధ్య జరుగుతున్న ఎన్నిక

మేడ్చల్ జోన్ బృందం: మల్లారెడ్డి మజాలేదు.. నాకు ఎదురు లేదు.. అంటూ తొడకొడితివి కదా.. ఈ నెల 29వ తేదీ వరకే నువ్వు గీసిన గీత దాటకుండా మీ సైన్యం ఉంటారని, 30వ తేదీన ఎన్నికల రోజు వాళ్లంతా మా సైన్యంలో కలవబోతున్నారని కాంగ్రెస్ మేడ్చల్ అభ్యర్థి తోటకూర వజ్రేష్(జంగయ్య) యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జవహర్‌నగర్, మేడ్చల్‌లలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ ఇది పేదోడికి, ఉన్నోడికి మధ్య జరుగుతున్న ఎన్నిక అని ప్రజలు తప్పకుండా న్యాయాన్ని గెలిపిస్తారిన ధీమా వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై అహంకారంతో వ్యవహరిస్తూ దోపిడీకి పాల్పడుతున్న మంత్రి మల్లారెడ్డికి ఈ ఎన్నికల్లో తప్పకుండా గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధమయ్యారని వివరించారు. రాష్ట్రంలో రేవంత్ అన్న సైన్యం అధికారంలోకి రాబోతోందని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మేడ్చల్ అభివృద్ధికి పాటుపడుతానన్నారు.

ముదిరాజ్, రజక, కురుమ సంఘం సభ్యుల మద్దతు..

కాంగ్రెస్ మేడ్చల్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు ముదిరాజ్, రజక, కురుమ సంఘం సభ్యులు భారీ సంఖ్యలో మద్దతు తెలిపారు. ఈ మేరకు మేడ్చల్ ముదిరాజ్ మహాసభ జిల్లా యువజన అధ్యక్షుడు అరకుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 600 మంది కాంగ్రెస్‌లో చేరారు.

భారీగా కాంగ్రెస్‌లో చేరికలు..

బోడుప్పల్‌కు చెందిన ఐదుగురు కార్పొరేటర్లు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్, జవహర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, సదానంద్, నర్సింగౌడ్, కుతాడి రవి, అనంతలక్ష్మి, రజిత, మంజుల, వెంకటేశ్వర్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, వివిధ పట్టణాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



కాంగ్రెస్‌లో చేరుతున్న మేడ్చల్ ముదిరాజ్ మహాసభ జిల్లా యువజన అధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు



ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చౌదరిగూడ ఎంపీటీసీ పులికంటి భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు శాఖల అధికారులు సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ చూపుతున్నారని అన్నారు. వెంకటాపూర్‌లో తాగునీరు, విద్యుత్ సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఎంపీటీసీ రామారావుముదిరాజ్, మాదారంలో ఎప్పుడు కరెంటో వస్తదో, రాదో తెలియని అయోమయంలో ఉన్నామని, గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని సర్పంచ్ యాదగిరి కోరారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మ సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కావడంతో మెజార్టీ నాయకుల నిర్ణయం మేరకు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎంపీడీఓ అరుణారెడ్డి, ఎంపీఓ నందకిశోర్, ఎంపీటీసీలు సరళముదిరాజ్, వినోద, రామారావుముదిరాజ్, సర్పంచులు మంగమ్మ, యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

మల్లారెడ్డి మహిళా కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



మల్లారెడ్డి మహిళా కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్, ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో క్వాలిజియల్ గ్రేస్ హప్పర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, లీడ్ ఇండియా ఆపరేషన్ హెడ్ మధుమూర్తి, హెచ్ఆర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక నైపుణ్యాలు, పద్ధతులు, సాధనాలను అభివృద్ధి చేయడం వల్ల డోమైన్ లేదా క్రమశిక్షణలో రాణించాలని తెలిపారు. సెంటర్ ఏర్పాటుతో సంస్థలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని, పెరిగిన సామర్థ్యం, అధిక నాణ్యత ప్రయోజనాలు పొందవచ్చని, పరిశ్రమలో పోటీతత్వం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హైరింగ్ క్వాలిజియల్ మేనేజర్ థిలేశ్వర్, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హలో డాక్టర్.. డ్యూటీకి రారా?

- 20 రోజులుగా విధులకు గైర్హాజరు
- నర్సులతోనే పనులు చేయిస్తున్న వైనం
- బస్తీ దవాఖానాలు ఉండి ఏమి లాభమంటున్న స్థానికులు

రంగారెడ్డినగర్: బస్తీ ప్రజల దరికి వైద్య సేవలను చేర్చాలన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో వాస్తవ పరిస్థితుల్లో అందుకు భిన్నంగా ఉంటున్నాయి. చాలా బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేకపోవడం, ఒక వేళ ఉన్నా సరైన సమయానికి డ్యూటీలకు రాకపోవడం, ఒక్కోసారి డుమ్మాలు కొట్టి నర్సులతోనే సేవలు చేయిస్తున్నారు.

- రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్, నందానగర్‌లోని కమిటీ హాలు లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. కాగా నందానగర్ బస్తీ దవాఖానా వైద్యుడు గత 20 రోజులకు విధులకు హాజరు కావడం లేదు. ప్రతిరోజు నందానగర్, మారుతినగర్, విజయనగర్‌కాలనీ, గాంధీనగర్, వెంకట్రామిరెడ్డినగర్, నెహ్రూనగర్, సంజీవ్‌గాంధీనగర్ తదితర బస్తీలకు చెందిన 70-80 మంది రోగులు నందానగర్‌లోని బస్తీ దవాఖానాకు వివిధ అనారోగ్య సమస్యలతో వస్తుంటారు.
- వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో నర్సు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగుల తాకిడి ఎక్కువుగా ఉంటే సమీపంలోని రంగారెడ్డినగర్ బస్తీ దవాఖానా, షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిందిగా సిఫార్సు చేస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వారు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.



- ఇదే విషయాన్ని 'సాక్షి'మండల వైద్యాధికారి డాక్టర్ నిర్మలను వివరణ కోరగా నందానగర్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యుడికి పీజీ సీటు రావడంతో ఉన్నత చదువుల కోసం రిజైన్ చేశారని.. ఎన్నికల పూర్తయిన తరువాతనే కొత్త డాక్టర్ వస్తారని చెప్పారు. దీంతో ఎన్నికల తతంగం పూర్తయ్యేంత వరకు దాదాపు మరో నెల రోజుల పాటు నందానగర్ పరిసర బస్తీల వాసులకు వైద్యసేవల తిప్పలు తప్పేటట్టే లేవు.

నిత్యాన్నదానం ప్రారంభం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని ఆశ్రిత వత్సల హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. అయ్యప్ప స్వాములకు, భక్తులకు ప్రతి రోజు మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తున్నారు. గురువారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నదాన దాతగా నిలిచారు. ఈ సందర్భంగా డి.పోచంపల్లి కౌన్సిలర్ రాముగౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

యువకులకు క్రికెట్ కిట్ అందజేత

సుభాష్‌నగర్: ఆటపాటలపై ఆసక్తి ఉన్నవారికి తన ప్రోత్సాహం ఉంటుందని ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన యువకులకు గురువారం క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మైనారిటీ ప్రెసిడెంట్ లాల్ మహమ్మద్, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఆబిద్, బి-బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సొంటి రెడ్డి చైతన్య, ట్రస్ట్ మెంబర్ దండే రాజు, పున్నన్న అభిమాన సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు విశాల్ అన్వర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

వనభోజన పోస్టర్ ఆవిష్కరణ

చింతల్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 19న శెట్టిబలిజ వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం నేతలు పేర్కొన్నారు. హెచ్ఎంటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయ పక్కన ఉన్న హరిహర కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 9గంటల నుంచి ఐకమత్యపు వనభోజన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఉంటాయన్నారు. అనంతరం బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వనభోజన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, సంఘం నేతలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కుత్బుల్లాపూర్: ఫిట్స్ వచ్చిన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 10వ తేదీన దేవరయాంజల్ వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడు (70) ఫిట్స్ వచ్చి కిందపడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. అనారోగ్య కారాణాలతోనే మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిస్తే పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: అత్వెల్లి సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శుక్రవారం డబీల్‌పూర్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ పవన్‌చంద్ తెలిపారు. గ్రామ పరిధిలోని అగ్రికల్చర్, డొమెస్టిక్, పరిశ్రమల సర్వీసులకు ఉదయం 10 గంటలకు సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం డబిల్‌పూర్ గ్రామానికి చెందిన భరత్(25) గురువారం ఉదయం గ్రామ పరిధిలో ఉన్న రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భరత్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



యాద్గార్‌పల్లిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కీసర: ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ స్థలాలను అన్యాక్రాంతం చేసేందుకు యత్నించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని కీసర తహసీల్దార్ అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి ఈస్ట్ సర్వే నంబర్-201లోని అసైన్డ్ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను గురువారం జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై పోవడంతో కొంత మంది వ్యక్తులు ప్రభుత్వ స్థలాలతో పాటు, అసైన్డ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టాలని యత్నిస్తున్నారని, అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మత్తు వదలరా.. లేక జారి పడుదువురా!



నేటి యువత మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడటానికి బానిసలు అవుతున్నారు అనడానికి ఈ చిత్రమే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గాజులరామారం డివిజన్ మెట్టుకానిగూడలోని గ్రౌండ్‌లో ఓ యువకుడు చెట్టుపై దర్జాగా కూర్చుని ఈ లోకాన్ని మరిచినట్టు సెల్‌ఫోన్‌లో సీరియస్ గేమ్ ఆడుతున్న దృశ్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది. ఆ యువకుడు చుట్టూ ప్రపంచాన్ని మరచి మరి చెట్టుపై ఎక్కి గంటల తరబడి సెల్‌ఫోన్ వాడుతున్నాడు. నేటి యువత అధికంగా మొబైల్ వాడుతూ విలువైన సమయాన్ని కోల్పోవడమే కాకుండా, అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇలాంటి యువకులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటప్పుడు వీరిపై తల్లిదండ్రులు కాస్తా దృష్టి సారించాల్సిన విషయం ఎంతైనా ఉంది.

– సుభాష్‌నగర్